
ఆంధ్రజ్యోతి
5
వనపర్తి
జిల్లా వార్తలు
బుధవారం 26 మార్చి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.4 | కనిష్ఠం : 25.6



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:53 (గురువారం ఉదయం)

ప్రభుత్వ బడుల్లో ఏఐ పాఠాలు

వవనపర్తి విద్యావిభాగం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులకు, ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన విద్య అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే సర్కారు బడుల్లో 'తొలిమెట్టు' కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా పాఠాలు బోధించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది.

పైలట్ ప్రాజెక్టు కింద 11 పాఠశాలలు

వనపర్తి జిల్లాలో హైస్కూల్‌కు అనుబంధంగా ఉన్న ఆయా ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్లు అందుబాటులో ఉన్న 11 పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. పాన్‌గల్ మండలంలోని బుసిరెడ్డిపల్లి, మదనాపురం మండలంలోని కొన్నూరు, శ్రీరంగాపూర్ మండలంలోని శ్రీరంగాపూర్, వెంకటాపూర్, వీపనగండ్ల మండలంలో గోవర్ధనగిరి, తూముకుంట, పెద్దమందడి మండలంలో మనిగిల్ల, చిన్నంబావి మండలంలో పెద్దమారూర్, వనపర్తి మండలంలో చందాపూర్, వనపర్తి పట్టణంలో తెలుగువాడ, పెబ్బేరు మండలంలో అయ్యవారిపల్లి పాఠశాలలను ఎంపిక చేశారు. ఈనెల 15 నుంచి ఏఐ ద్వారా పాఠాలు ప్రారంభించారు. జూన్ 1 నాటికి జిల్లాలోని 102 ప్రాథమిక, 36 ప్రాథమికోన్నత పాఠశాలల్లో, ఒక్కో పాఠశాలకు 5 కంప్యూటర్లను కేటాయించనున్నది. జిల్లాలోని దాదాపు 12,395 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేర్చుకోవడం ఇలా

విద్యార్థులు కంప్యూటర్‌లో భాషను ఎంచుకోవాలి. స్ర్కీన్‌పై అక్షరాలను గమనిస్తూ హెడ్‌సెట్ పెట్టుకుని వినాలి. నెమ్మదిగా వాటిని అర్థం చేసుకుని చదవాలి. అప్పటికీ అర్థం కాకుంటే వీడియో ఓపెన్ అవుతుంది. అందులో టీచర్ తెలుగు అక్షరాలను పలుకుతూ విద్యార్థికి అర్థమయ్యేలా బోధిస్తుంది. నెట్ సౌకర్యం, హెడ్‌సెట్, సౌండ్ సిస్టం, కంప్యూటర్లో ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



పెద్దమారూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు

ఆధునికీకరణతోనే సాగునీరు

- ఆర్డీఎస్ వద్ద పూడిక తీయాలి
- పగిలిన షెట్టర్లు, కాల్వలకు మరమ్మతు చేయాలి
- ఏళ్లుగా పగిలిన తూములను మూయకపోవడంతో నీరు వృథా..
- తుమ్మిళ్ల కింద రిజర్వాయర్లను నిర్మించాలి
- 1960 నుంచి నీటి కోసం ఆరాటం
- పంట తడవాలంటే జాగరణ చేయాల్సి వస్తోంది
- కుట్కనూరు వద్ద లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తే ప్రయోజనం
- 'ఆంధ్రజ్యోతి' చర్చా వేదికలో వక్తలు



'ఆంధ్రజ్యోతి' చర్చా వేదికలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

ఆంధ్రజ్యోతి చర్చా వేదిక

అలంపూర్(నియోజకవర్గ బృందం) మార్చి, 25 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్‌ను ఆధునికీకరించడంతో పాటు తుమ్మిళ్ల ఎత్తిపోతల కింద రిజర్వాయర్లను పూర్తి చేస్తేనే చివరి ఆయకట్టు వరకు నీరందుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. అందుకోసం సమష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆర్డీఎస్‌కు 15.9 టీఎంసీల నీటి కేటాయింపులు ఉండగా కనీసం 8 టీఎంసీలు వాడుకోలేని దుస్థితికి కారణం పాలకులేనని మండిపడ్డారు. దాంతో చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నడిగడ్డ వ్యవసాయ రంగ వరప్రదాయినిగా పిలువబడుతున్న ఆర్డీఎస్ పరిస్థితి నానాటికీ అడుగంటుతోంది. 87,500 ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టు నేడు 30 వేలకు మించి ఇవ్వలేకపోతోంది. గత ప్రభుత్వం ఆర్డీఎస్ డీ24 ద్వారా దాదాపు 55 వేల ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా రూ.783 కోట్ల వ్యయంతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. రూ.783 కోట్లు కేటాయించగా.. రూ.570 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. 2018 ఎన్నికల అవసరాల కోసం హడావిడిగా పథకాన్ని ప్రారంభించి మమ అనిపించారు. రిజర్వాయర్లను, ఆర్డీఎస్ కెనాల్ వ్యవస్థను ఆధునికీకరించకపోవడంతో రైతాంగం పరిస్థితి మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో

(మిగతా 7లో..)

ఆర్డీఎస్ ఆధునికీకరణే శరణ్యం



ఆర్డీఎస్ ఆధునికీకరణ దిశగా పాలకులు, అధికారులు ఆలోచిస్తే ఏనాడో రైతులు బాగుపడేవారు. వందల కోట్లతో నిర్మించిన తుమ్మిళ్ల ప్రాజెక్టు సామర్థ్యానికి తగ్గట్లుగా కెనాల్ నిర్మాణం లేకపోవడం, ప్రాజెక్టు కింద రిజర్వాయర్లు నిర్మించకపోవడం వలన రైతులకు ఈ దుస్థితి ఏర్పడింది.

\- వరప్రసాద్, ఆర్డీఎస్ మాజీ అధికారి

సాగునీటి సమస్య జఠిలమవుతోంది

ఆర్డీఎస్ ప్రారంభం నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరందిన దాఖలాలు లేవు. రానురాను సాగునీటి సమస్య జఠిలమవుతోంది. ఆర్డీఎస్ సమస్యను పరిష్కరించేందుకు 107 ప్యాకేజీ పనులను పూర్తి చేయాలి. మల్లమ్మ కుంట రిజర్వాయర్ కూడా పూర్తిచేయాలి.

\- రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, జోగుళాంబ గద్వాల

ఆర్డీఎస్‌కు చిన్నోనిపల్లి లింకు చేయాలి



సింధనూరు నుంచి తుమ్మిళ్ల వరకు నీరందాలంటే చిన్నోని పల్లి రిజర్వాయరు నుంచి ఆర్డీఎస్ కెనాల్ లింకు ఏర్పా టు చేస్తే రైతులకు సమృద్ధి గా సాగునీరు అందుతుంది. దీనికి సంబంధించి 2017లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి ఆర్డీఎస్‌ను పరిశీలించాం. రూ.50కోట్లు కేటాయిస్తే సరిపోతుంది, లింకు ఏర్పాటు చేస్తే గ్రావిటీ ద్వారా ఆర్డీఎస్ కాలువకు నీటి సరఫరాతో రైతులకు న్యాయం జరుగుతుంది.

\- పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్

ఈ సారైనా..

- సన్నబియ్యం పంపిణీ జరిగేనా..?
- ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది సన్న వడ్లు
- ప్రజా పంపిణీలో దొడ్డు బియ్యం
- అయోమయంలో ప్రజలు
- ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామంటున్న ప్రభుత్వం
- ఎదురుచూస్తున్న నిరుపేదలు



రాజోలి రేషన్ షాపుల్లో ప్రజలకు పంపిణీ చేస్తున్న దొడ్డుబియ్యం

రాజోలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రేషన్ షాపుల ద్వారా ఈ సారైనా సన్నబియ్యం పంపిణీ చేస్తుందా అనే సందేహం లబ్ధిదారుల్లో నెలకొన్నది. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ రూపాయికి కిలో చొప్పున 6 కిలోల బియ్యం పంపిణీ చేస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 333 చౌకధర దుకాణాలు ఉన్నాయి. మొత్తం 3,70,043 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతీ నెల జిల్లా వ్యాప్తంగా 3,524 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు జరగకుండా చూసేందుకు 2018 జనవరి నుంచి ఈ-పాస్ యంత్రాల ద్వారా, 2018 డిసెంబరు నుంచి ఐరిస్ యంత్రాల ద్వారా బియ్యం పంపిణీని ప్రారంభించారు. దీని ఫలితంగా నెలకు సగటున సుమారు 350 మెట్రిక్ టన్నుల బియ్యం ఆదా చేశారు.

రాజోలి మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి మొత్తం 20 రేషన్ షాపులు ఉండగా 9,449 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇటీవల మరి కొన్ని కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. ఈ కార్డు దారులకు ప్రతీ నెల 202 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ప్రభుత్వం ఏటా రైతులు పండించిన సన్నవడ్లను కొనుగోలు చేసి ప్రజలకు అందించాలని నిర్ణయించింది. అయితే రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసే గద్వాల జిల్లా గోదాముల్లో సన్న బియ్యం ఉన్నప్పటికీ గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు చేరేవరకు దొడ్డు బియ్యంగా మారుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

రేషన్ బియ్యం పక్కదారి..

రేషన్ షాపుల్లో పంపిణీ చేసిన బియ్యాన్ని కొందరు తక్కువ ధరకు కొనుగోలు చేసి పక్క ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఉగాది పండుగ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని పలు సభలు, సమావేశాల్లో నాయకులు ప్రకటించారు. కానీ ఈ ఉగాది నుంచి అయినా సన్నబియ్యం పంపిణీ చేస్తారా అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

సన్న బియ్యం పంపిణీతో అక్రమ రవాణాకు చెక్



ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తే బియ్యం అక్రమ రవాణాకు చెక్ పడనుంది. ప్రభుత్వం ఉగాది నుంచి పంపిణీ చేసే సన్నబియ్యం నాణ్యతగా ఉంటే ఎవరు విక్రయించరు. దీంతో ప్రభుత్వం లక్ష్యం కూడా నెరవేరుతుంది.

\- వంక మహేష్, రాజోలి గ్రామం

అపర భద్రాద్రికి ఆదరణ కరువు

- 1,400 ఎకరాలకు పైగా భూములున్నా అభివృద్ధి శూన్యం
- సిర్సనగండ్ల ఆలయ అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని డిమాండ్
- 800 ఏళ్ల క్రితమే ఏకశిలపై సీతారామచంద్ర స్వామి విగ్రహాలు



6

రైతులపై పోలీసు కాల్పులను ఖండించాలి

- కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య

7

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

6

పాలెం వెంకన్న స్వామి హుండీ లెక్కింపు

- రూ.3.17 లక్షల నగదు, 35 గ్రాముల బంగారం

6

జములమ్మా.. జయమునివ్వు


- ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారావు

గద్వాలకు సమీకృత కోర్టు సముదాయ భవనం మంజూరు

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న న్యాయదేవాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.81కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ గద్వాలలో సమీకృత కోర్టు భవన నిర్మాణం కోసం నిధుల విడుదలకు ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంత్రులకు గద్వాల ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యుడి స్విమ్మింగ్



క్లిక్.. క్లిక్..

నిప్పులు కక్కుతూ ఎండతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసే భానుడికి తన సెగ తనకే తగిలినట్లుంది. ఆ ఉక్కపోత భరించ లేక నీటిలో దిగి, కాసేపు ఈత కొట్టాలని అనిపించినట్లుంది. అందుకే ఓ కుంటలో దూకి సరదాగా కాసేపు సేద తీరాడు. ఈ కుంటలో సూర్యుడి ప్రతిబింభాన్ని చూస్తుంటే అలానే అనిపిస్తుంది కదూ! వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ శివారు కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

ఉరివేసుకొని బిహార్ యువకుడి ఆత్మహత్య

\- నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని రాచూరు తండాలో ఘటన

6

రైతు ఆత్మహత్యాయత్నం

పెబ్బేరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి శ్రీకాంత్ తన వ్యవసాయ పొలంలో ఆరేళ్ల క్రితం బోరు వేసుకున్నాడు. నీళ్లు పుష్కలంగా వచ్చాయి. బోరునీటి ఆధారంగా 5 ఎకరాల్లో బత్తాయి తోటను సాగు చేసుకున్నాడు. తోట మంచి కాపు కాసింది. వారం రోజుల క్రితం పక్క రైతు శ్రీకాంత్ బోరుకు కొద్ది దూరంలో బోరు వేశాడు. దీంతో తన బోరులో నీళ్లు తక్కువగా వస్తున్నాయని, బత్తాయి తోట ఎండిపోతుందని మనస్థాపం చెంది వ్యవసాయ పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగుల మందు తాగే సమయంలో తహసీల్దార్, పోలీసులు స్పందించి చర్యలు తీసు కోవాలంటూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ వీడియో చూడగానే కుటుంబ సభ్యులు వెళ్లి అతన్ని చికిత్స నిమిత్తం కర్నూల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం

పంట నష్టాన్ని పరిశీలించిన కలెక్టర్

కొత్తకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల కిందట కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అంచనాలతో కూడిన నివేదిక ప్రభుత్వానికి ఇస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని సంకిరెడ్డిపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటల వివరాలు సేకరిస్తున్నారు. సంకిరెడ్డిపల్లి గ్రామంలో 170 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లును కలెక్టర్ పరిశీలించారు. మోడల్ ఇంటి నిర్మాణంలో మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, డీఈ విఠోభా, ఉద్యాన శాఖ పీడీ పర్వతాలు, ఏడీఏ దామోదర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆలయ అభివృద్ధికి కార్యాచరణ అమలు చేయాలి

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జోగుళాంబ ఆలయ పర్యవేక్షణ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అలంపూర్ తెలంగాణలో ఏకైక శక్తిపీఠంగా ఉన్నందున, దేవాలయ అభివృద్ధితో పాటు పర్యాటక అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రసాద్ పథకం భవనాన్ని టూరిజం శాఖ అధికారులు వెంటనే దేవాదాయశాఖకు అప్పగించాలని సూచించారు. హైదరాబాద్-కర్నూల్ నుంచి అలంపూర్ మార్గాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో పచ్చదనం, శుభ్రత పెంపొందించాలని సూచించారు. దేవాలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు శాఖల వారీగా వారం రోజుల్లో ప్రతిపాదనలను అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, దేవాలయ డిజైనర్ గోవిందహరి, ఏడీ ఆర్కియాలజి నాగలక్ష్మి, ఈవో పురేందర్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

క్రైం కార్నర్

పోక్సో కేసులో నిందితుడికి 25 ఏళ్ల కారాగార శిక్ష

» పేట జిల్లా ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేటరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి పేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్‌రఫీ మంగళవారం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.60వేల జరిమానా, బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చినట్లు పేట జిల్లా ఎస్పీ యోగేశ్‌గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేట మండలానికి చెందిన బాలికను హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని బుద్వేల్‌కు చెందిన వేముల అభిలాష్ ప్రేమిస్తున్నానని వెంటపడి వేధించాడన్నాడు. గతేడాది మార్చి 1న బాలిక కర్ణాటకలోని బంధువుల పెళ్లికి వెళ్లి సాయంత్రం సమయంలో పేట బస్టాండ్‌లో ఉండగా అభిలాష్ మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి బుద్వేల్‌లో ఒక ఇంట్లో ఉంచి పలుమార్లు అత్యాచారం చేశాడన్నారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు మార్చి 2, 2024న పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారన్నారు. సీఐ శివశంకర్ కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. డీఎస్పీ లింగయ్య సూచన మేరకు ఏఎస్‌ఐ కోర్టు లైజనింగ్ అధికారి బి.కృష్ణయ్యగౌడ్, కోర్టు డ్యూటీ అధికారి జె.విజయకుమార్, హెచ్‌సీ మీర్జాబేగ్ కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టారన్నారు. పీపీ ఆకుల బాలప్ప వాదనలు వినిపించగా నేరం నిరూపణ అయి నిందితుడికి శిక్ష వేశారన్నారు. నిందితుడికి శిక్ష పడడంలో బాగా పనిచేసిన పోలీస్, పీపీ, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించారు. మహిళలను వేధించిన వారికి చట్టప్రకారం చర్యలు తప్పవని యోగేశ్‌గౌతమ్ హెచ్చరించారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

కొత్తపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చిరుత పులి దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం గోకుల్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకుల్‌నగర్ గ్రామానికి చెందిన రైతు కావలి గోవిందు సోమవారం సాయంత్రం తన సొంత వ్యవసాయ పొలంలోని పశువుల పాకలో దూడను కట్టివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం గోవిందు పొలానికి వెళ్లి చూడగా లేగదూడ మృతిచెంది కన్పించింది. చిరుత తెల్ల వారుజామున పాకలోకి ప్రవేశించి లేగ దూడపై దాడి చేసినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడికి పరిహారం అందించాలని స్థానికులు కోరారు. కాగా, చిరుత సంచారంతో తాము పొలాలకు వెళ్లలేకపోతున్నామని పలు వురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ధరూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోతులగిద్ద గ్రామ స్టేజీ సమీపంలో గద్వాల పట్టణం తెలుగుపేటకు చెందిన దర్సెల్లి(40) చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘట న మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండా శ్రీహరి తెలిపిన వివరాలు.. దర్సెల్లి సోమవారం ఉదయం ఇంటి నుంచి తన ఆటోలో కోతులగిద్ద పరిసర ప్రాంతాల్లో ఉన్న కాలువలో చేపలవే టకు వెళ్లాడు. అక్కడే ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి ధరూర్ పోలీసులకు సమా చారం అందించగా, ఘటనా స్థలానికి ఎస్‌ఐ చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని వెలికితీసి, మృతుని వద్ద ఆధారాలను సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దర్సెల్లి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

కల్వకుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ రుక్నుద్దీన్ డిసెంబరు నెలలో ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. తనకు అప్పులు ఎక్కువగా ఉన్నందున ఇంటి నుంచి వెళ్లాడని తండ్రి జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకొని బిహార్ యువకుడి ఆత్మహత్య

వెల్దండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని రాచూరుతండా శివారులోని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జిల్లా కస్తూరిపూర్‌కు చెందిన మోహిత్ కుమార్ పాస్వాన్ (19) రాచూరు సమీపంలోని వింటేజ్ కాఫీ కంపెనీలో 20 రోజుల క్రితం పనికి కుదిరాడు. ఈ క్రమంలో తోటి కార్మికులతో కలిసి మోహిత్‌కుమార్ సమీపంలోని షెడ్‌లో ఉంటున్నాడు. ఉదయం తోటి కార్మికులు పనికి వెళ్లగానే మోహిత్‌కుమార్ టవల్‌తో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి వెళ్లి విచారించారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ జకీఉల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లీ పిల్లలు అదృశ్యం : కేసు నమోదు

ఖిల్లాఘణపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన కావలి స్వాతి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు భర్త కావలి ఆంజనేయులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పరిపల్లికి చెందిన కావలి ఆంజనేయులుకు 8 సంవత్సరాల కిందట షాద్‌నగర్‌కు చెందిన గాజులపేట స్వాతితో వివాహమైంది. వారికి కౌశిక్, జ్ఞానేశ్వరి పిల్లలున్నారు. ఈ నెల 24న స్వాతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తల్లి గారింటికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లింది. కావలి ఆంజనేయులు సాయంత్రం తన మామ రాజుకు ఫోన్ చేసి విచారించగా.. స్వాతి రాలేదని తెలపడంతో తెలిసిన ప్రదేశాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

గోపాల్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : తాగిన మైకంలో ఈత కొడుతూ.. నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఆవుల శ్రీను మండలంలోని మున్నూరు గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో తిరుగు ప్రయాణంలో వనపర్తికి వెళ్తుండగా... మున్నూరు కొత్త బావి చెక్ డ్యాం వద్ద ఈత పడదామని చెక్ డ్యాంలోకి దిగి ఈతకు దిగాడు. తాగిన మైకంలో ఈదలేక నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడు శ్రీను భార్య ఆవుల విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా



చారకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పి లారీ బోల్తా పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని మర్రిపల్లిలో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపి వివరాల ప్రకారం.. దేవరకొండ నుంచి కల్వకుర్తి వైపు 30 టన్నుల ప్లాస్టిక్ సీడ్స్ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ సురోజీత్‌కు స్వల్పగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మర్రిప ల్లి నుంచి చారకొండ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతు న్నాయి. దేవరకొండ నుంచి మర్రిపల్లి వరకు జాతీయ రోడ్డు పనులు చేసి వదిలేశారు. పనులు జరుగుతన్న ప్రదేశంలో సూచిక బోర్డులు పెట్టలేదు. మర్రిపల్లి నుంచి చారకొండ వరకు సింగిల్‌రోడ్డు ఉండడంతో వాహనదారు లు గమనించక వేగంతో వెళ్తున్నారు. గతంలో ఈరోడ్డులో అనేక ప్రమా దాలు జరిగి మృతి చెందిన ఘటనలున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

అపర భద్రాద్రికి ఆదరణ కరువు



సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ వ్యూ

» 1,400 ఎకరాలకు పైగా భూములున్నా అభివృద్ధి శూన్యం

» సిర్సనగండ్ల ఆలయ అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని డిమాండ్

చారకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెండవ అపర భద్రాదిగా పేరు గాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల పంచాయతీలోని అయోధ్యనగర్ (గుట్ట)లో 14వ శతాబ్దం రాచకొండ పద్మనాయకుల కాలంలో సుమారు 50 ఎకరాలకు పైగా ఉన్న ఏకశిలపై 800 ఏళ్ల క్రితమే కొండపై సీతారామచంద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాతి స్తంభాలతో భక్తుల కోసం నిర్మించిన అన్నదాన సత్రం పూర్తిగా శిథిలమైపోయింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా దండోర వేసిన వారు విశ్రాంతి తీసుకునేందుకు చాపల గుండు వద్ద నిర్మించిన గదులు, భక్తులు నడుచుకుటూ వెళ్లే మెట్లు కూడా శిథిలావస్థకు చేరాయి. ఆలయానికి దక్షిణ భాగంలో ఉన్న కోనేరు సమీపంలో రాతి బండపై ఉన్న రాములోరి పాదాలకు ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి గదులు లేవు. ఈ ఆలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని యాద్రాద్రి తరహాలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని భక్తులు కోరుతున్నారు.

ఏటా శ్రీరామనవమికి బ్రహ్మోత్సవాలు

ప్రతి ఏటా ఏప్రిల్ మాసంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని దేవాదాయ, ధర్మాదాయశాఖ, ఫౌండరి ట్రస్ట్ ఆధ్వర్యంలో పక్షం రోజుల పాటు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సీతారాములను దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకొంటారు.

1,400 ఎకరాలకు పైగా భూములున్నా..

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలో సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామికి 1,400 ఎకరాలకు పైగా సాగుభూమి ఉన్నా ఆలయం మాత్రం అభివృద్ధికి నోచుకోక ఆమడ దూరంలో ఉంది.

భూములు సాగు చేసుకుంటున్న వారు ఏళ్ల నుంచి ఎలాంటి కౌలు చెల్లించడం లేదు.

భూములు అన్యాక్రాంతం



దేవాలయానికి చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. భూములు సాగు చేస్తున్న ఎలాంటి కౌలు కట్టడం లేదు. ఆలయ అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రజాప్రతినిధులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పినా జరగడం లేదు. ఈప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

- ఢేరం రామశర్మ, చైర్మన్, సిర్సనగండ్ల దేవాలయం

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



దేవాలయ ఆవరణంలో స్వామి వారికి కల్యాణ మండపం, భక్తుల సౌకర్యార్థం 50 గదుల నిర్మాణం, వంద మరుగుదొడ్లు, స్నానాలు చేసేందుకు పది గదులు, కోనేరు, గుట్టపైకి వాహనాల రాకపోకలకు రెండులైన్ల రహదారి, ఇరువైపుల లైట్లు, పార్కు, అన్నదానసత్రం, గుట్ట దిగువన మినీ రిజర్వాయర్‌తో పాటు పర్యాటక కేంద్రంగా ఆలయాన్ని తీర్చిదిద్దాలి.

- ఢేరం లక్ష్మణశర్మ, ఆలయ పూజారి



ఇసుక టిప్పర్ పట్టివేత

కృష్ణ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా కృష్ణానది నుంచి కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా కేంద్రానికి ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రానికి చెందిన పోలీసులు నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా టైరోడ్ నుంచి యాదగిరి వెళ్తున్న ఓ ఇసుక టిప్పర్‌ను చేగుంట వద్ద పట్టుకున్నారు. టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వంగూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డిండిచింతపల్లి దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా వాగుల నుంచి ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తండాల్లో ఎక్సైజ్ దాడులు

కొత్తపల్లి/ మద్దూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని దుప్పట్లఘటు తండా, వాల్యానాయక్ తండాల్లో డీటీఎఫ్ అధికారులు, మద్దూర్ మండలంలోని మేడికుంట తండాల్లో ఎక్సై జ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దుప్పట్లఘట్టు తండా, వాల్యానాయక్ తండాల్లో ఎటువంటి సారా, పదార్థాలు లభించకపోవడంతో అధికారులు హెచ్చరికలు చేశారు. మేడికుంట తండాలో రెండు లీటర్ల సారా, 80 లీటర్ల బెల్లం పానకాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐలు ఎండీ.జబ్బార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల సౌకర్యాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ అండ్ ఆర్ కమిషనర్ టి. వినయ కృష్ణారెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీల్లో అన్ని రకాలమ మౌళిక సౌకర్యాలు వేగవంతం చేయాలని ఆర్ అండ్ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి రెవెన్యూ ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆర్అండ్ఆర్ పనులపై సమీక్షించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉందండపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్టతండా, శామగడ్డతండా, ఒంటిగుడిసె తండా, పోలెపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద 300 గజాల స్థలం ఇవ్వాలన్నారు. అదేవిధంగా అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, పార్కులు ఏర్పాటు నిర్ధేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్‌లు గడువులోగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి ఆర్అండ్ఆర్ కింద తీసుకున్న చర్యలు వివరించారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వేల్యాండ్ రికార్డ్స్, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సంక్షేమ పథకాల పెంపు

» నిర్మాణ కార్మిక సంఘం మహాసభలో వక్తల పిలుపు



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం

పాలమూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (టీయూసీఐ) వెలుగులో బలమైన పోరాటాల నిర్మాణంతోనే సంక్షేమ పథకాల పెంచుకోగలుగుతాం. హక్కులు సాధిస్తామని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ, ఇరత కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభలు జిల్లా కేంద్రంలో నిర్వహించారు. టౌన్‌హాలు నుంచి రోజ్‌గార్డెన్ వరకు నిర్మాణ రంగం కార్మికులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో సుమారు 25 కోట్ల మంది భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 30 లక్షల మంది కార్డు హోల్డర్స్‌గా ఉంటే సెస్ రూపేనా సంక్షేమ బోర్డులో కోట్లలో డబ్బు జమ అయిందన్నారు. తిరిగి వాటిని కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసమే పనిచేస్తున్నామని చెప్పే పాలకులు ఆచరణలో కష్టపడే నిర్మాణ కార్మికులకు ఏమి చేయకపోవటం అమానుషమన్నారు. సంక్షేమ బోర్డులో నిజమైన కార్మిక సంఘాలకే ప్రాతినిత్యం లేకపోవటం బోర్డు వైఫల్యానికి, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్స్‌ను పరిష్కరించాలన్నారు. తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మేష్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణ, బీవోసీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డులో ఉన్న రూ.2022 కోట్లను ఇతర పథకాలకు, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు మళ్లించేందుకు కుట్ర పన్నుతోందని నిప్పులు చెరిగారు. టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్, పి.అరుణ్‌కుమార్, దేవదానం, కె.రవి, కిరణ్, నరసింహ, కోళ్ల వెంకటన్న, బాలు, సి.రాజు, కిష్టన్న, చెన్నప్ప, పుల్లన్న, వెంకన్న, నల్లన్న, రామదాసు, కృష్ణ, దేవరాజు, శంకర్ ప్రసంగించారు. కార్యక్రమంలో గణేష్, చంద్రన్న, మారుతి, సత్యనారాయణ, బి.గణేష్, విజయ్, మస్లమాని, జిలాని, కుర్మన్న, ప్రేమరత్నం, అంజన్న, కృష్ణ, దాసు, అంజి, కె.రాజన్న, కొండారెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

యువకుడి మృతిపై విచారణ



విచారణ చేస్తున్న టు టౌన్ సీఐ ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి చెందిన ఘటనపై మంగళవారం రెండో పట్టణ సీఐ ఇజాజుద్దీన్ విచారణ చేపట్టారు. జడ్చర్ల మండల కేంద్రానికి చెందిన రవీంద్ర శనివారం చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. అంతే కాకుండా అతని మృతికి డాక్టర్ల నిర్లక్ష్యం, ఇంజక్షన్ వికటించడమే కారణమంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. దీంతో రెండో పట్టణ సీఐ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో విచారణ చేపట్టారు. ఆ రోజు ఇంజక్షన్ ఎవరు తెచ్చారు? అసలు ఇంజక్షన్ ఇచ్చారా.. లేదా..? బయటికి ఎవరు రాసిచ్చారు? అనే అంశాలపై విచారణ చేశారు. ముందుగా మృతుడికి ఇచ్చిన ట్రీట్‌మెంట్‌పై డాక్టర్లను, ఇంజక్షన్ బయట తెచ్చిన మృతుడి బంధువులను, ఇంజక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నర్సింగ్ సిబ్బందిని విచారించారు. దీనిపై పూర్తి నివేదిక తయారు చేసిన అనంతరం పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటా మని సీఐ తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, జనరల్ మెడిసిన్ విభాగం డాక్టర్లు ఉన్నారు.

పాలెం వెంకన్న స్వామి హుండీ లెక్కింపు

» రూ.3.17 లక్షల నగదు, 35 గ్రాముల బంగారం



పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, అధికారులు

బిజినేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలోని అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం దేవాదాయశాఖ జిల్లా పర్యవేక్షకురాలు వెంకటేశ్వరి, చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి ఆధ్వర్యంలో చేపట్టారు. 2025, జనవరి 23 నుంచి మంగళవారం వరకు హుండీలో భక్తులు సమర్పించిన నగదు, బంగారం లెక్కించినట్లు తెలిపారు. నగదు రూ.3,17,864, బంగారం 35 గ్రాములు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చిలుకూరు రంగారావు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొన్న భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజ చార్యులు, జయంత్, శుక్లా, చక్రపాణి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించారు.

జములమ్మ జయమునివ్వు

» ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారావు



అమ్మవారిని దర్శించుకున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్

గద్వాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 20వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. ఆలయ గదులతో పాటు పరిసరాలలో షామియానాలు వేసుకొని నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. చీర, రవికతో పాటు వెండి పాదాలు, కడియాలు బియ్యంతో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్

జములమ్మ అమ్మవారిని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందించగా ఆలయ ఈవో పురేందర్‌కుమార్ వారిని శేషవస్త్రాలతో సత్కరించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

తాడూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునెల్లికుదురు గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతె లియని వ్యక్తి హుండీ పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లా డు. మంగళవారం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి వెళ్తుండగా, మేడిపూరు గ్రామం వద్ద సుద్దకల్లు గ్రామానికి చెందిన భక్కయ్య అనుమానంతో కనపడగా, అతన్ని విచారించడంతో చోరికి పాల్పడినట్లు అంగీకరించాడు. అతన్ని కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

ఇంటి గోడకూలి రైతు మృతి

కోడేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఇంటి గోడకూలి రైతు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తెలుగు ఎలగొడ్ల బాలయ్య (60) ఉదయం పాత ఇంటి గోడను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు రాళ్ల అతనిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అలివేలు, కుమారుడు రమేష్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

సైబర్ నేరానికి పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష

ఊర్కొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరానికి పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష విధించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో మంగళ వారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన సత్యేంద్ర రాయ్ ఊర్కొండపేట శివారులోని సూర్యలత కాటన్ మిల్లులో పనిచేసేవాడు. గతేడాది నవంబరు 9వ తేదిన (ఎస్‌పీవీపై) నావీ అనే యాప్ ద్వారా రూ.1.25లక్షలు పోగొట్టుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కల్వకుర్తి సీఐ నాగరాజు నిర్వహించిన దర్యాప్తులో భాగంగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎండీ అమీర్ అన్సారీ సైబర్ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. అతన్ని పట్టుకుని మంగళవారం కల్వకుర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్య ఎదుట ప్రవేశపెట్టి సాక్ష్యాధారాల ను చూపించడంతో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆధునికీకరణతోనే సాగు నీరు

(5వ పేజీ తరువాయి)

మంగళవారం అలంపూరు చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్ హాల్‌లో 'జోగుళాంబ గద్వాల జిల్లా ఆర్డీఎస్-తుమ్మిళ్ల సాగునీటి పరిస్థితులు' అనే అంశంపై చర్చా వేదిక ఏర్పాటు చేశారు. నియోజకవర్గ రైతులు, పార్టీలు, ప్రజా సంఘాలు, సాగునీటి సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆర్డీఎస్ సమస్యలను పరిష్కరించేందుకు 107 ప్యాకేజీ పనులను పూర్తి చేయాలని బీజేపీ జోగుళాంబ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అనగా, నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు సంఘటితమై ఉద్యమిస్తేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అన్నారు. ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు నీరందాలంటే కాలువలను ఆధునికీకరించాలని రిటైర్డ్ టీచర్ రాం మోహన్ అభిప్రాయపడ్డారు. వారితో పాటు ఉండవల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సురవరం లోకేశ్వరెడ్డి, కుర్వపల్లయ్య, బీజేపీ అలంపూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజగోపాల్, పాలమూరు అధ్యయన వేదిక గద్వాల నాయకులు హనుమంతురావు, సింధనూరు రైతులు సురేంద్రస్వామి, రవిరెడ్డి, భూంపురం రైతు నరసింహరెడ్డి మాట్లాడారు. రైతులు భద్రయ్య, చాంద్‌నాయక్, రాముడు, బ్రహ్మయ్య, మల్లేశ్, రమేశ్ అభిప్రాయలను వెల్లడించారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్యూరో ఇన్‌చార్జి ఎన్.రవీందర్‌రెడ్డి, విలేకరులు శ్రీనువాసులు, గోపాలకృష్ణ, మద్దిలేటి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి చర్చా వేదిక


చర్చా వేదికలో వక్తలు

ఎండుతున్న పంటను కాపాడుకోవాలి



ఆర్డీఎస్ ఆయకట్టు కింద సాగుచేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఏకతాటిపైకి వచ్చి తుంగభద్రానదిలో అదనపు నీటి వాటాను కోరుతూ విడుదల చేయించుకోవాలి. ఉన్నతాధికారులు స్పందించి నీటిని విడుదల చేయించాలి.

- రాముడు, సింగిల్ విండో మాజీ చైర్మన్

తెలంగాణ వాటా నీటిని కర్ణాటక తోడేస్తుంది



తుంగభద్ర డ్యామ్ నుంచి రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల వాటా నీటిని విడుదల చేస్తే మధ్యలోనే కర్ణాటక వారు దిగువకు రాకుండానే అక్రమంగా వాడుకుంటున్నారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు విడివిడిగా కాకుండా ఒకేసారి నీటని విడుదల చేయించుకోవాలి.

- నర్సింహారెడ్డి, ఎక్లాస్‌పురం, అయిజ మండలం

రావణ కాష్టంలా రగులుతోంది



ఆర్డీఎస్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు సమస్య రావణ కాష్టంలా రగులుతోంది. ప్రభుత్వం తుంగభద్ర నదిలోని నీటివాటాను కోల్పోకుండా ప్రయత్నాలు చేయాలి. అందుకు ఆర్డీఎస్ ఆధునికీకరించటమే కాకుండా చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి లింకు, మల్లమ్మ కుంట పూర్తి చేయాలి.

- నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అఖిలపక్షం నాయకుడు, అలంపూర్

కుట్కనూరు లిఫ్ట్ ఏర్పాటు చేయాలి



అయిజ మండలంలోని కుట్కనూరు సమీపంలో తుంగభద్ర నదివద్ద లిఫ్ట్ ఏర్పాటు చేస్తే ఆర్డీఎస్ రైతులకు మేలు జరుగుతుంది. 1990 వరకు ఆర్డీఎస్ రైతులకు ఎలాంటి సమస్య రాలేదు. అది మొదలుకొని ఇప్పటి వరకు ప్రతీ ఏడాది సాగునీటి సమస్య తలెత్తుతూనే ఉంది. ఈ లిఫ్ట్ ఏర్పాటు చేస్తే తుమ్మిళ్ల వరకు సాగునీరు అందుతుంది.

- మధుసూదన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్, అయిజ

పంట తడవాలంటే.. జాగరణ చేయాల్సి వస్తోంది



నా తండ్రి కాలం నుంచి పంట తడవాలంటే జాగరణ తప్పడం లేదు. ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నా మా రైతుల జీవితాలు మారడం లేదు. తుమ్మిళ్ల ద్వారా సాగునీరు అందుతుందనుకుంటే నిరాశే ఎదురైంది. ప్రభుత్వం నీటి పన్ను వసూలు చేసినా ఇబ్బంది లేదు. కానీ ప్రతీ ఎకరాకు నీరందిస్తే అదే పదివేలు.

- తిమ్మప్ప, మానవపాడు గ్రామ రైతు

ప్రభుత్వం దృష్టి సారించాలి



ప్రభుత్వాలు అనుకుంటే ఎలాంటి సమస్య అయినా పరిష్కారం అవుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్డీఎస్‌పై దృష్టి సారించాలి. మన ప్రాంత ముఖ్యమంత్రి అనుకుంటే ఈ సమస్య నుంచి రైతులు గట్టెక్కుతారు.

- ప్రహ్లదరెడ్డి, మాజీ ఎంపీపీ, అయిజ

బలమైన ప్రజా ఉద్యమం రావాలి



బలమైన ప్రజా ఉద్యమం వస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయి. ప్రాజెక్టుల నిర్మాణం, తాగు, సాగు నీటిని అందించే విధంగా ఉండాలి. అన్ని పార్టీల వారు నిర్లక్ష్యం కారణంగా సమస్యలు రోజురోజుకు జటిలమవుతున్నాయి.

- ఎక్బాల్ బాషా, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్, గద్వాల



ఐక్యంగా ఆర్డీఎస్ ఆశయాలను సాధించుకోవాలి

60 ఏళ్లుగా అంతిరించిపోతున్న ఆర్డీఎస్ ఆశయాలను రైతులంతా ఐక్యంగా ఉండి సాధించుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీరు అందించే విధంగా ఏర్పాటు చేసిన చట్టాలను ప్రభుత్వాలు మరిచిపోయాయి. ఆర్డీఎస్‌కు 15.9 టీఎంసీల వాడుకునేందుకు తెలంగాణకు హక్కు ఉంది. ఆర్డీఎస్‌కు వచ్చే నీరు చివరి వరకు అందాలంటే కాలువలను ఆధునికీకరించాలి.

- రామ్మోహన్, రిటైర్డ్ టీచర్


రాష్ట్రం సాధించుకున్నది నీరు, నిధులు, ఉద్యోగాల కోసమే



నీరు, నిధులు, ఉద్యోగాల కోసం తెలంగాణ సాధించుకున్నాం.. కానీ ప్రత్యేక రాష్ట్రంలో ఆర్డీఎస్ రైతులకు అన్యాయం జరుగుతోంది. రాయలసీమలో ప్రజల కోసం పోరాడే నాయకులు ఉన్నారు. తెలంగాణలో నాయకుల కోసం పోరాడే ప్రజలు ఉన్నారు. రాజకీయాలకు బానిస కాకుండా రైతులు కలిసికట్టుగా సాగునీటిని సాధించుకోవాలి.

- నాగేష్ యాదవ్, నడిగడ్డ హక్కుల పోరాట ఉద్యమకారుడు

పదవులు శాశ్వతం కాదు.. పనులే శాశ్వతం



ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద కొన్నేళ్ల క్రితం పగిలిన తూములను మూసే నాథుడు లేక ఇప్పటికీ సాగునీరు వృథాగా పోతుంది. కొందరు నాయకులు ఆర్డీఎస్ సమస్య గురించి అడిగితే మాకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పదవులు శాశ్వతం కాదు... చేసే పనులే శాశ్వతం.

- చిన్నహనుమంతు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు, అయిజ

సంఘటితం అయితేనే రైతుకు భవిష్యత్



ఆర్డీఎస్ నీటి కోసం నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు నాయకులు సంఘటితంగా ఉద్యమిస్తేనే రైతు భవిష్యత్ బాగుంటుంది. కొంత కాలంగా నాయకులు ఆర్డీఎస్ ముసుగులో ఓట్లు దండుకున్నారే తప్ప ఏనాడు రైతు పక్షనా నిలబడలేదు. ఐక్యంగా పోరాటం చేస్తే తప్ప నీరు అందే ఆవకాశం లేదు.

- జీకే ఈదన్న, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

మూడు రిజర్వాయర్లు నిర్మిస్తేనే సాగునీరు



ఆర్డీఎస్ కింద ఉన్న 55 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ఏర్పాటు చేసిన తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా పూర్తి స్థాయి సాగునీరు అందించాలంటే లిఫ్టు కింద మూడు రిజర్వాయర్లు పూర్తి చేయాలి. మల్లమ్మకుంట, వల్లూరు, జూలకల్ రిజర్వాయర్లు నిర్మించి, నదికి వరద వచ్చినప్పుడు నీటిని తోడేసి రిజర్వాయర్లు నింపి వేసవిలో ఉపయోగించుకునేలా చూడాలి.

- భూషణం, పడమటి గార్లపాడు మాజీ సర్పంచు

రెండు నదులున్నా.. పంటలు ఎండిపోతున్నాయి..



ఇటు కృష్ణ అటు తుంగభద్ర నదుల మధ్య ఉన్నా పంటలు ఎండిపోయే దుస్థితి. నదీతీర ప్రాంతాల గుండా రెండు గ్రామాలకు ఒక చిన్నపాటి లిఫ్ట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం సస్యశామలం అవుతుందేమో. రెండు నదుల నీటిని వాడుకోకపోవడంతో నీరంతా దిగువకు వెళ్లిపోతుంది.

- శేషన్‌గౌడు, కంచుపాడు మాజీ సర్పంచు

నీటి స్థిరీకరణ జరగాలి



నీటి స్థిరీకరణ, చట్టబద్ధత జరగలేదు. ఇవన్నీ కంటి తుడుపు చర్యలే. కేసీ కెనాల్‌కు సైతం పూర్తిస్థాయిలో న్యాయం జరగడంలేదు. హెచ్‌ఎల్‌సీ ద్వారా నీరు తీసుకోమంటున్నారు. పనిచేస్తేనే ఓట్లు వేస్తామని ప్రజలు చెప్పినప్పుడే న్యాయం జరుగుతంది. ప్రజల్లో ప్రశ్నించే తత్వం రావాలి.

- నాగేశ్వరాచారి, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు

తెలంగాణకు తీరని అన్యాయం



ఆర్డీఎస్ సాగునీటి విషయంలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. నాటి నుంచి నేటి వరకు పాలకులు ఆర్డీఎస్ రైతుల సమస్యను పట్టించుకోలేదు. ఆనకట్ట వద్ద 20ఫీట్ల లోతు సిల్టు పెరుకుపోయినా తొలగించకపోవడం దారుణం. అలాగే కాలువలు కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు.

- గుమ్మ గోవర్ధన్, ఉద్యమకారుడు

దాశరథి రచనలు స్ఫూర్తిదాయకం

» మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


కరపత్రం విడుదల చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మహాకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య రచనలు తరతరాలకు స్ఫూర్తిదాయకం కావాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకల కరపత్రాన్ని మాజీ మంత్రి ఆయన నివాసంలో ఆవిష్కరించి మాట్లాడారు. దాశరథి శత జయంతి వేడుకలకు సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, తెలంగాణవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, తిరుమల్, మహేశ్వర్ రెడ్డి, అశోక్, శంకర్ గౌడ్, నారాయణ రెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడమే లక్ష్యం

» ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి


ఆఫర్ లెటర్ అందుకున్న నిరుద్యోగులు

కల్వకుర్తి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మెగాజాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 10 వేలకు పైగా యువతకు ఉద్యోగాలు అందించేందుకు నిత్యం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు 2,500 మంది నిరుద్యోగులు, 68 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. 230 మందికి పైగా అభ్యర్థులకు తక్షణమే ఆఫర్ లెటర్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సుభాషిని, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం; కేసు నమోదు

రాజోలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రాజోలిలో ఓ యువతి కనిపించకుండా పోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆ వివరాలు.. రాజోలికి చెందిన మహబూబ్ బాషా మంగళవారం మధ్యాహ్నం నమాజ్ చేసేందుకు మసీదుకు వెళ్లగా 3:30 గంటలకు కుమారుడు వచ్చి అక్క అచ్చుగట్ల రఫియా (22) ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లేదని, ఎస్సీకాలనీకి చెందిన ప్రదీప్ అనే యువకునిపై అనుమానం ఉందని తెలిపారని ఎస్ఐ పేర్కొన్నారు.

వడగళ్లతో రెండు వేల ఎకరాల్లో నష్టం

» ఆందోళనలో రైతులు

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


కర్వెన గ్రామంలో దెబ్బతిన్న రైతు వరి పంట

భూత్పూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : చేతికొచ్చిన పంట ఒక్క క్షణంలో వడగళ్ల వానతో నేల మట్టమైంది.. దీంతో అన్నదాత ఒక్క సారిగా ఆందోళనకు గురయ్యాడు. వరణ దేవుడా ఇంత పగ ఎందుకు పట్టావురా.. అంటూ రైతులు కన్నీరు పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాలుగు రోజుల క్రితం అకాల వర్షం రైతుల పంటలపై బీభత్సం సృష్టించింది. మండలంలోని కర్వెన, మద్దిగట్ల, వెల్కిచర్ల, భటుపల్లి, తాటిపర్తి గ్రామాల్లో కురిసిన వడగళ్ల వర్షంతో దాదాపు రెండు వేల ఎకరాల్లో వరి పంట పూర్తి దెబ్బతిన్నది. వారం పది రోజుల్లో పంట చేతికొస్తుంది.. చేసిన అప్పులు తీరుతాయనుకున్న రైతులకు వరుణ దేవుడు కష్టాలు తెచ్చిపెట్టాడు. వడగళ్ల వర్షానికి వరి, పండ్ల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని గుర్తించిన జిల్లా, మండల వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టమైన గ్రామాలు సందర్శించి, దెబ్బతిన్న పంటలను అంచనా వేశారు. వరి 1,476 ఎకరాలు, మొక్కజొన్న 65 ఎకరాలు, ఇతర పంటలు 500 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించాలని ప్రతిపక్ష నాయకులు, ప్రజా, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

చేతికొచ్చిన పంట నేల పాలైంది..



12 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇంకా వారం పది రోజుల్లో పంట చేతికొస్తుందని సంతోషపడ్డాను. కానీ ఇంతలోనే వడగళ్ల వర్షం కురిచడంతో 12 ఎకరాల పంట మొత్తం నేలపాలైంది.

అశోక్‌రెడ్డి, రైతు, కర్వెన

పిల్లల చదువుకు కష్టం వచ్చిపడింది..



నాకున్న ఏడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట చేతికొచ్చే సమయంలో వర్షంతో నేల రాలింది. దీంతో పిల్లల చదువులు, చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

మల్లేష్, రైతు, కర్వెన

ఎన్నో ఆశలు పెట్టుకున్నా..



నాకున్న ఐదెకరాల్లో వరి సాగు చేశాను. పంట చేతికొస్తదని ఎన్నో ఆశలు పెట్టుకున్న. ఈ సారి పంట చాలా బాగా పండింది. ఇక కష్టాలు తీరుతాయనున్న తరుణంలో ఇలా అవుతోందని ఊహించలేదు.

- మన్నెపురెడ్డి, రైతు, కర్వెన


కర్వెన గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి వరి పంట పూర్తి దెబ్బతిన్న చూసి దిగాలుగా చూస్తున్న రైతు

ఎన్నో ఆశలు పెట్టుకున్నా..

నాకున్న ఐదెకరాల్లో వరి సాగు చేశాను. పంట చేతికొస్తదని ఎన్నో ఆశలు పెట్టుకున్న. ఈ సారి పంట చాలా బాగా పండింది. ఇక కష్టాలు తీరుతాయనున్న తరుణంలో ఇలా అవుతోందని ఊహించలేదు.

- మన్నెపురెడ్డి, రైతు, కర్వెన

రైతులపై పోలీసు కాల్పులను ఖండించాలి

» ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య


మాట్లాడుతున్న ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య

గద్వాల టౌన్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం పంజాబ్‌లో ఆందోళన చేస్తు రైతులపై పోలీసులు కాల్పులు జరపడం అమానుషమని కిసాన్ సంయుక్త మోర్చా (ఎస్కేఎం) రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య అన్నారు. పంజాబ్ పోలీసుల తీరును నిరసిస్తూ ఈ నెల 28న తలపెట్టిన దేశవ్యాప్త నిరసనల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మంగళవారం పట్టణంలోని రైతాంగ సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన వెంకటయ్య, పంజాబ్ ప్రభుత్వం రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్, శ్రవణ్‌సింగ్ పాంతర్‌లతో సహా 350మంది రైతు నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టడం అన్యాయమన్నారు. రైతుల రుణమాఫీ, పంటలకు కనీస మద్దతు ధర వంటి న్యాయమైన డిమాండ్లతో రైతులు చేస్తున్న పోరాటానికి ప్రజాస్వామికవాదులు, ప్రజలు, మేధావులు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో గోపాల్, ఆశన్న, సత్యారెడ్డి, వాల్మీకి, వినోద్‌కుమార్, నాగరాజు, రామకృష్ణ, రామరాజు ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారులు

» రాష్ట్ర బాలుర జట్టులో జే.సురేష్‌కు చోటు


జే. సురేష్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బీహార్ రాష్ట్రంలోని గాయ జిల్లాలో ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టుకు జిల్లా క్రీడాకారుడు జే.సురేష్ ఎంపికైయ్యాడు. జాతీయ స్థాయి టోర్నీ జిల్లా క్రీడాకారుడు ఎంపిక కావటంతో జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, దామోదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలరాజ్, సీనియర్ క్రీడాకారులు పాపరాయుడు, గణేష్ అభినందించారు. జాతీయ స్థాయి టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాక్షించారు.

జాతీయ కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా పెద్దమందడి అమ్మాయి


ఇస్లావత్ అనూష

పెద్దమందడి, మార్చి 25, (ఆంధ్రజ్యోతి) : పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామ పరిధిలోని పిల్లిగుండ్ల తండాకు చెందిన ఇస్లావత్ అనూష తెలంగాణ రాష్ట్ర బాలికల కబడ్డీ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపికైంది. మండలానికి చెందిన అనూష గురుకుల ట్రైబల్ వెల్ఫేర్ మహబూబ్‌నగర్‌లో 8వ తరగతి వరకు, 9వ తరగతి రంగారెడ్డి జిల్లా నలకంచ కబడ్డీ అకాడమీలో చదువుకుంటూ... గత నెల వికారాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేయడంతో జాతీయ జట్టుకు ఎంపికైంది. బిహార్ రాష్ట్రం, గయా ప్రాంతంలో కొనసాగనున్న జాతీయ కబడ్డీ టీంలో పాల్గొననుంది.

మండుతున్న ఎండలు

మహబూబ్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఎండలు కాస్త పెరిగాయి. మూడు రోజులుగా వాతావరణం అప్పుడప్పుడు మేఘావృతంతో పాటు తేలికపాటి జల్లులతో చల్లబడింది. మంగళవారం ఎండలు అధికమై ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో 38.6 డిగ్రీలు, వనపర్తి జిల్లా కేతేపల్లిలో 38.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ధరూర్‌లో 38.3, గద్వాలలో 38.2, ఇటిక్యాలలో 38.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 37.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

న్యూస్ బాక్స్

ఆసుపత్రి పరిశీలన



ఆసుపత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ వందన

రేవల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కాయకల్ప టీం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వందన ఆసుపత్రిలోని పరిస్థితులను, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిశుభ్రంగా ఉంచుతున్నారా లేదా పరిశీలించారు. డాక్టర్ వందన కాయకల్ప టీం సభ్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

వనపర్తి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ సమీపిస్తున్న తరుణంలో మునిసిపల్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కమిషనర్‌ను సీఐటీయూ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కురుమయ్య, మౌలాలి, గోపాల్ పాల్గొన్నారు.

వార్డుల్లోని సమస్యలు..

వనపర్తి పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో సీపీఎం పట్టణ కమిటీ నాయకులు సర్వే చేశారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఆంజనేయులు, పరమేశ్వరాచారి, గంధం మదన్, బాలస్వామి, పుల్లయ్య, రత్నయ్య, డి బాలరాజు, మన్నెం తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు

అమరచింత, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు అమరచింత టీయూసీఐ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు అమరచింత పట్టణంలో బైక్ రాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర మహాసభలకు తరలి వెళ్లారు. రాజన్న, రాజు, ప్రేమరత్నం, కురుమన్న, భక్త రాజు, సత్యనారాయణ, జిలాని, ఆనంద్, విజయ్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వనపర్తి లీగల్ కంట్రీబ్యూటర్ మార్చి 25, (ఆంధ్రజ్యోతి) : సేవా దృక్పథం ప్రతీ ఒక్కరిలో ఉండాలని వనపర్తి జిల్లా జడ్జి ఎం.ఆర్ సునీత అన్నారు. మంగళవారం జిల్లా న్యాయస్థానం ఆవరణలో చలివేంద్రం కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి రజిని, కవిత, వై.జానకి, మోహన్‌కుమార్, బాల నాగయ్య పాల్గొన్నారు.

నేడు సహకార సంఘం సర్వసభ్య సమావేశం

శ్రీరంగాపూర్/ పాన్‌గల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన సహకార కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీఈవో భాస్కర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పన్నులు చెల్లించకుంటే ఇల్లు సీజ్ చేస్తాం

పెబ్బేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్నులు చెల్లించకుంటే ఇంటిని సీజ్ చేస్తామని మునిసిపల్ కమిషనర్ అశోక్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మునిసిపల్ మేనేజర్ గణేష్ బాబు నేతృత్వంలో మునిసిపాలిటీలో బకాయిలు ఉన్న ఆస్థి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడారు. మునిసిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన సురేష్ రెండు ఏళ్ల నుంచి ఇంటి పన్ను బకాయి ఉందన్నారు. పలుమార్లు బకాయి చెల్లించాలని అడిగిన స్పందించలేదని పేర్కొన్నారు. అనుమతి లేకుండా సెల్లార్ నిర్మాణం చేపట్టడంతో జరిమానా విధించామన్నారు. ఇంటి పన్ను, అనుమతి లేని సెల్లార్ నిర్మాణానికి రూ.3 లక్షల 49వేలు బకాయి ఉండడంతో ఇంటిని సీజ్ చేశామన్నారు. మూడు రోజుల కిందటే ఇంటి యజమానికి రెడ్ నోటీస్ జారీ చేశామని చెప్పారు.

వడదెబ్బలపై ప్రజలకు అవగాహన

శ్రీరంగాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబాలాపురంలో మంగళవారం వడదెబ్బలపై చైతన్య కళాబృందం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎండల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు ప్రజలను చైతన్యపరిచారు. పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళా బృందం

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు/ ఖిల్లాఘణపురం/ వీపనగండ్ల/ గోపాల్‌పేట / అమరచింత/ కొత్తకోట/ మదనాపురం/ చిన్నంబావి/ పెబ్బేరు/ పాన్‌గల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆశాలపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఖండిస్తూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్త రేణుక మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలపై వ్యహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆశా వర్కర్ల హక్కుల కోసం హైదరాబాద్ వెళ్లిన మహిళలని చూడకుండా అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌లో ఉంచారని అన్నారు.

- పెబ్బేరులో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు.



వనపర్తిలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు



పెబ్బేరులో రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు

- చిన్నంబావి మండల కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని అంబేడ్కర్ విగ్రహానికి, జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు.
- అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ అన్నారు. వనపర్తిలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆశ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

విగ్రహానికి వినతి...

కొత్తకోట పట్టణ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆశా కార్యకర్తలు వినతి పత్రం అందజేసి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అమరచింతలో ఆశావర్కర్లు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. గోపాల్‌పేటలో వివిధ గ్రామాల్లో పని చేస్తున్న ఆశా కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.



కొత్తకోటలో...

పంట మార్పిడితో రైతులకు అధిక లాభాలు



అమరచింత మండలం నాగల్‌కడుమూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

అమరచింత, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు తరచూ ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడికి శ్రీకారం చుడితే సాగు చేసే పొలం సారవంతంతో పాటు రైతులకు అధిక దిగుబడి, లాభాలు పొందవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని నాగల్‌కడుమూర్ గ్రామ రైతు వేదికలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయిల్ పామ్ పంటతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని అన్నారు.

విధులపై నిర్లక్ష్యం తగదు

అమరచింత : మునిసిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేయాలని, విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. మంగళవారం అమరచింత మునిసిపల్ కార్యాలయంలో ఆత్మకూరు, అమరచింత మునిసిపల్ కమిషనర్లు, అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయంలో రికార్డులు ఆస్తి పన్నుల వివరాలు పరిశీలించి మాట్లాడారు. మునిసిపల్ పరిధిలోని ఆస్తి, నల్ల పన్నుల వసూలు, ఎల్ఆర్ఎస్ పేమెంట్లపై దృష్టి సారించాలని ఆదేశించారు.

ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి సారించాలి

ఆత్మకూరు : ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి సారించి రైతులు అత్యధికంగా సాగు చేసి లాభాలను ఆర్జించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ శివారులోని చరణ్ కుమార్ రెడ్డి సాగు చేసిన 20 ఎకరాల ఆయిల్ ఫామ్ తోటను జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, హార్టికల్చర్ అధికారి సురేష్ కుమార్, తహసీల్దార్ చాంద్ పాషాతో కలిసి మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో అక్రమంగా లే అవుట్‌లు వెలిశాయని, తమ దృష్టికి వచ్చింది. అలాంటి వాటిని తక్షణమే పరిశీలించి అక్రమ లే అవుట్‌లో రాళ్లను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శశిధర్, రెవెన్యూ సిబ్బంది, మునిసిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులతో కలిసి వైద్య అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్సీ రిజిస్ట్రేషన్‌ల సంఖ్యపెరగాలని సూచించారు. డా. సాయినాథ్ రెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

ఉగాది పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం వనపర్తి జిల్లా డీడీఎంఎస్ అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరం పంచాంగ పుస్తకం ఆవిష్కరణ చేశారు.

వనపర్తి అర్బన్ : విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో విశ్వ బ్రాహ్మణ వేద పండితులచే రూపొందించిన పంచాంగాన్ని ఎస్పీ రావుల గిరిధర్ ఆవిష్కరించారు.

గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా డెలివరీ చేయాలి

వనపర్తి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వంటగ్యాస్ సిలిండర్‌పై చేస్తున్న అదనపు వసూళ్లను కట్టడి చేసి ఉచితంగా సిలిండర్‌ను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయ్ డీఎస్‌వోను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు పరమేశ్వరాచారి, గంధం గట్టయ్య బాలస్వామి, బీసన్న తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వాచ్‌మెన్ కోసం దరఖాస్తులు

ఖిల్లాఘణపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొంతికుంట తండాలోని మోడల్ స్కూల్ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించడానికి డీఈవో ఆదేశాల మేరకు ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థికి కనీసం చదవడం, రాయడంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 50 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండి ఆరోగ్యంగా ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు.

నీటి సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగు, సాగునీటి సమస్యలపై దృష్టి సారించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, రైతుల నుంచి అనేక విజ్ఞప్తులు వచ్చాయని తెలియజేశారు.

కాలువ మరమ్మతులు చేపట్టాలి

పాన్‌గల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేఎల్ఐ డీ81 చివరి ఆయకట్టు కాలువ తెగిపోవడంతో సుమారు 20 ఎకరాల పంట నష్టం వాటిల్లిందని, తెగిపోయిన కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లి తండా చివరి ఆయకట్టు వద్ద తెగిపోయిన కేఎల్ఐ డీ 81 కాలువను మంగళవారం రైతులు పరిశీలించారు. అనంతరం నాగర్‌కర్నూల్, వన పర్తి జిల్లాలకు సంబంధించిన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తెగిపోయిన కాలువ మరమ్మతులు చేయాలని కోరారు.



కాలువను పరిశీలిస్తున్న రైతులు

వీర సముద్రం చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరంగాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తాటిపాములలో వీర సముద్రం చెరువును స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ రాముడుతో కలిసి ఆయన వీర సముద్ర చెరువును పరిశీలించారు. ఇటీవల వర్షాలకు కట్ట కుంగి ఒక రంధ్రం పడిందని ఆయన తెలిపారు. ఈ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఉండాలి

పెబ్బేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు లోబడే వెంచర్ నిర్మాణాలు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం పెబ్బేరు మునిసిపాలిటీలోని 318, 319 సర్వే నెంబర్లలో నూతనంగా నిర్మాణం చేపట్టిన లే అవుట్ నిర్మాణాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్మాణంలోని రోడ్ల విస్తీర్ణం, సర్వే నెంబర్లు తదితర అంశాలను తహసీల్దార్ లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ అశోక్ కుమార్ రెడ్డి, ఆర్ఐ రాఘవేందర్ రావు, వెంకట మహాలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడి ఎన్నిక

గోపాల్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కోదండ రామస్వామి దేవాలయంలో జర్నలిస్టు సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షునిగా ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడు తోడుగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మండల సీనియర్ జర్నలిస్టులు బలరాం, రాధాకృష్ణ, మండల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను చేరదీయాలి

వనపర్తి లీగల్ కంట్రీబ్యూటర్ మార్చి 25, (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను చేరదీయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని కోరారు. మంగళవారం ఆమె వనపర్తి పట్టణంలోని వికలాంగులు పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. వికలాంగులు, బుద్ధిమాంద్యం ఉన్న వారికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అదే విధంగా ఇటువంటి లక్షణాలు ఉన్న వారికి స్పెషల్ ట్రైన్ టీచర్, స్పీచ్ థెరపి, సైన్ లాంగ్వేజ్ ద్వారా మాటలు వచ్చేలా శిక్షణ ఇస్తున్నారన్నారు. జి.ఉత్తరయ్య వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలుశిక్ష

పెబ్బేరు రూరల్, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలపై ప్రయాణించే సందర్భంలో పోలీసులకు పట్టుబడిన సంఘటనలో ఇద్దరి వ్యక్తులకు జిల్లా న్యాయస్థానం రెండు రోజు జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఛత్రపతి శివాజీ విగ్రహం కమిటీ ఎన్నిక

అమరచింత, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రతిష్ఠాపన కమిటీని మంగళవారం అమరచింత మార్కండేయ ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీ అధ్యక్షుడిగా దేవర్ల మేస్త్రీ సురేష్, ప్రధాన కార్యదర్శిగా దామోదర్, తిరుమలేష్, ఉపాధ్యక్షులుగా కొట్టం వెంకటేశ్వర్ రెడ్డి, ఆరె కటిక శివాజీ, రవికుమార్ యాదవ్, కార్యదర్శులుగా రఘురాం రెడ్డి, భీమ్ సేనా, క్యామ భరత్ తదితలను ఎన్నుకున్నారు.

సాగు నీరందించడంలో విఫలం

మదనాపురం, మార్చి 25, (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. మంగళవారం మండలంలోని దంతనూరు, గోవిందహళ్లి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. దంతనూరులో మూడు వందల ఎకరాల్లో వరి పంటను వేసుకున్న రైతులు సాగునీరు లేక విలవిలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు పరిశీలించి పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గోవిందహళ్లిలో రాంరెడ్డి బొంద వద్ద చెక్‌డ్యామ్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. బీర్ల ప్రసాద్, కోటకొండ చెన్నయ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న రోజు నుంచే 'ఉపాధి'

ఆత్మకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న రోజు కూలీలకు ఉపాధి కల్పించాలని ఆత్మకూరు మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే రైతుల భూమి లెవలింగ్, పంట కాలువల మరమ్మతులు, సర్కారు తుమ్మ తొలగింపు వంటి పనులను కేటాయించాలని సూచించారు. ఎంపీడీవో శ్రీపాదు, శ్రీరామ్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

విద్యుత్ కోతలు విధిస్తే ధర్నాలు చేపడతాం

పెబ్బేరు రూరల్ / వనపర్తి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : చేతికి వచ్చే పంటలకు విద్యుత్ కోతలు విధిస్తే ధర్నాలు చేపడతామని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోని నాచహళ్లి గ్రామ శివారులోని సబ్ స్టేషన్ ముందు వనపర్తి మండల అధ్యక్షుడు మాణిక్యం ఆధ్వర్యంలో మండల నాయకులు నాచహళ్లి, కిష్టగిరి, పెద్ద గూడెం తండా, పెద్దగూడెం, సవాయిగూడెం గ్రామాల రైతులతో కలిసి ఫ్లకార్డులు పట్టుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో పంటలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. అనంతరం విద్యుత్ ఈడీ జావిద్‌కు వినతిపత్రం అందజేశారు. మాధవరెడ్డి, కొండన్న, ధర్మా నాయక్, వెంకటయ్య, కృష్ణా నాయక్, మహేశ్వర్ రెడ్డి, రాజు, పవన్, కురుమయ్య, శ్యామ్ పాల్గొన్నారు.



సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

108 వాహనంలో మహిళకు ప్రసవం

ఖిల్లాఘణపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆగారంకి చెందిన గర్భిణి నందినికి మంగళవారం తెల్లవారు జామున పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆసుపత్రిలో డెలివరీ చేయడం కష్టంగా మారడంతో కొత్తకోట 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ రావడంతో 108 సిబ్బంది వాహనంలోనే డెలివరీ చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బందిని వైద్యులు అభినందించారు.

పదేళ్లలో అభివృద్ధిని పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు పేరుతో బీఆర్ఎస్ నాయకులు నీతులు మాట్లాడడం సరికాదన్నారు. పదేళ్ల కిందట గ్రామాల్లో అభివృద్ధి చేసిన సర్పంచులను అప్పులపాలు చేసి నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేసి నేడు మేమే ఉద్ధరించం అంటూ రోడ్లెక్కడం అందరు గమనిస్తున్నారన్నారు. బోయోజ్, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, సలీం, జేసీబీరాము ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలి వెళ్లిన గ్రామ పంచాయతీ కార్మికులు



ఖిల్లాఘణపురం నుంచి హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఖిల్లాఘణపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఖిల్లాఘణపురం మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు 5 తుఫాన్ వాహనాల్లో ఛలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లారు. గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పానుగంటి దాసు, శ్రీనివాసులు, వెంకటేష్, లక్ష్మి నారాయణ, శేఖర్, బద్రి, నరసింహ, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, పద్మ, భాను పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

రేవల్లి : మండలం నుంచి మంగళవారం ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న వీవోఏలను ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అమరచింత, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయసులో వివాహాలు చేయడంతో శారీరక మానసిక సమస్యలు వస్తాయని, బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంఆర్ సునీత పేర్కొన్నారు. మంగళవారం అమరచింత చేనేత హ్యాండ్లూమ్ కంపెనీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలతో ఎన్నో సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. కవిత, జానకి, చిన్నమ్మ థామస్, మహంకాళి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి సునీత

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

పాన్‌గల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ దేశం కోసం ప్రాణాలు ఇచ్చాడని ఆ వీరుడి ఆశయాలను కొనసాగించడమంటే దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడమేనని ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ విజయ్, సామాజిక ఉద్యమ నాయకులు, రచయిత కిరణ్ కుమార్‌లు అన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లిలో మంగళవారం లిటిల్ స్టార్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా 200 మంది విద్యార్థులతో 2 కిలో మీటర్ల మేర భగత్‌సింగ్ స్ఫూర్తి పరుగు నిర్వహించారు. అనంతరం భగత్‌సింగ్ వారసులం అనే పేరుతో ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ కాకం ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శేఖర్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

మద్యం, డబ్బుల కోసం గొర్రెల చోరీ

నలుగురు అరెస్టు : రూ.90 వేల రికవరీ

అమరచింత, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసలై, విలాసవంతంగా గడపడానికి డబ్బులు అవసరమై గొర్రెలను చోరీ చేసి అడ్డంగా దొరికిపోయిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలం చింతరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలను మంగళవారం అమరచింత పోలీస్ స్టేషన్‌లో సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చింతరెడ్డిపల్లికి చెందిన కురువ నాగరాజు గ్రామ శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన సురేష్ పొలంలో ఈ నెల 22న గొర్రెల మందను నిలుపుకున్నాడు. 23న గొర్రెల మందలో 13 గొర్రెలు కనిపించలేదు. దీంతో 24న సోమవారం అమరచింత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు మొదట పొలం యజమాని సురేష్‌పై అనుమానం వచ్చి విచారించగా.. ఇందులో నర్వ, అమరచింత మండలాలకు చెందిన సురేష్, గోవిందు, మల్లేష్, భీమన్న కలిసి దొంగలించినట్లు నిర్ధారణ అయింది. 13 గొర్రెలను బొలెరో వాహనంలో కోస్గి సంతలో విక్రయించగా వచ్చిన రూ.90వేల నలుగురు పంచుకున్నట్లు తెలిపారు. నలుగురు దొంగలను అదుపులోకి తీసుకుని రూ.90 వేలు రికవరీ చేసి, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ